స్కెచ్

# "తెల్ల దుంపలు"

జి. అచ్యుతరామయ్య

మూర్తి లైబ్రరీలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. దేశంలో ప్రబలంగావున్న నిరుద్యోగ సమస్యను గురించి వ్రాయబడిన సంపాదకీయం అతన్ని ఆకర్షించింది. తీక్షణంగా చదువుతున్నాడు. "గంట" అయింది. ప్రక్కనే వున్న మురళి "బెల్లు అయింది, రారా" అనే సరికి మూర్తి యీ లోకంలోపడ్డాడు. ఇద్దరూ బయలుదేరి క్లాసురూము చేరుకున్నారు.

లెక్చెరరు చెప్పుకుపోతున్నాడు. అరగంట అయేక ఆగి "టేక్ డవున్" అన్నాడు. మిగతా కాలమంతా కలక్టరాఫీసు గుమాస్తాలా చేతులు నొప్పి పుట్టేటట్టు వ్రాసేదు నోట్సు. రోజూ అంతే. మొదటి అరగంట ఉపన్యాసం, మిగతా అరగంట నోట్సు. ఆ కాలేజీకి అది ప్రత్యేకత. ఎంత వ్రాసినా నోట్సు తరగటం లేదు. రోజురోజుకూ వృద్ధి చంద్రుడిలా పెరిగిపోతున్నది. అప్పుడప్పుడు ఎందుకీ వ్రాతంతా అనుకునేవాడు మూర్తి. సంపాదకీయం కళ్ళ ముందు ప్రత్యక్షమయేది. తానుకూడ యీ చదువు తరువాత ఆ నిరుద్యోగ శాఖలోనే చేరాలా అనుకునేవాడు. ఏమో; పరీక్షలు సమీపిస్తున్నాయి. భయంగా వుంది. అయినా తప్పదు. క్లాసులో నోట్సుతో పేజీలు నింపి యింటిదగ్గర ఎద్దులా పనిచేయాలి. పరీక్షలో పేపర్లు నింపాలి. ఎన్నికష్టాలుపడ్డా ప్యాసవాలి. అదే గమ్యస్థానం. కాని ఆ గమ్యస్థానం చేరే లోపున ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటాయి. వాటికి తట్టుకుంటూ విజయధ్వజ మెత్తాలి. అది మానవ విధి. అయినా కొంతమంది విఫలు లవుతూంటారు. అలా అని ముందుగా మనం మానకూడదు. అలాగే మూర్తికూడ పని చేస్తున్నాడు, మూడు పూటలయి తిండి లేక పోయినా.

సాయంత్రం మూడున్నర అయింది. ప్రక్కవాడు ఎంత తొందరగా బెల్లు అవుతుందా అని చూస్తున్నాడు. మధ్యలో మూర్తితో అన్నాడోసారి, "ఎంతకూ బెల్లు అవదేంరా?" అని. ఎందుకో వాడు అలా తొందరపడుతున్నాడు? తన్ను బాధిస్తున్నట్టే వాడిని కూడ ఆకలి బాధిస్తూందేమో? మరి తను వాడిలాగ బెల్లుకు తొందరపడటం లేదే!

ప్రక్కనున్న వాడి తండ్రి పెద్ద గవర్నమెంటు ఉద్యోగి. వీడొక్కడే కొడుకట. అతనెక్కడో వుంటూ వీణ్ణి యిక్కడ హాస్టల్లో వుంచి, వీడు ఎప్పుడు ఎంత కావాలన్నా తాను దొంగ లంచాలద్వారా గడించిన సొమ్మును పంపి "చదువు" చెప్పిస్తున్నాడు. వీడికి రెండు పూట్లా హాస్టలు టిఫిను చాలదు. హోటలుకు పోతాడు. రోజుకు రెండు కాప్స్టన్ సిగరెట్టు పెట్టెలు, వారానికి ఒక సినిమా. ఎలా లేదన్నా హాస్టలు బిల్లు కాకుండా పైగా డెబ్భయి రూపాయలు రమారమిఅవుతుంది. మరి తానో, ఉదయం 9 గం॥లకు రాత్రి 8 గం॥లకు భోజనం, అంతే. ఈ మధ్యను మరేం వుండదు. తనతండ్రి రాబడంతా ఆ స్నేహితుడు పైగా పెట్టె ఖర్చంత వుంటుంది. మరి టిఫిను ఎక్కణ్ణుంచి వస్తుంది.

కాలం మనకోసం ఆగదు. మూడూయాభై అయింది. మూర్తికి లెక్కలేనన్ని ఆలోచనలు. బెల్లయిన వెంటనే యింటికి పోవాలి. కాలేజీలో కూర్చుందామన్నా వీలుండదు. తలుపులు వేసేస్తారు. క్లాసులో వున్నంతసేపూ ఎలాగోలాగ ఆకలిక తట్టుకోవచ్చు. ఇంటిదగ్గర ఆకలితో వుండటం కన్న మరో నరకముండదు. అయినా యింటికిపోవాలి. ఆకలితో పోరాడాలి. అణగ ద్రొక్కాలి!

మూర్తి మొదట వద్దన్నాడు కాలేజీ చదువు, యింటి పరిస్థితులుచూసి. "ఉన్న ఒక్క పిల్లాడైనా కాలేజీ ముఖము చూడకుండా చదువు ముగించటమా, వీల్లేదు" అని మూర్తిని ప్రవేశపెట్టేడు అతని తండ్రి. అవసరం వస్తే తిండైనా మాన్దామను

కున్నారు తల్లి తండ్రులు. నానా తంటాలుపడి టర్మ్‌ఫీ కట్టేస్తున్నాడు ఆయన. కాని తిండి గురించి అంతబాధ పట్టం లేదు. ఉన్న నాడు తింటున్నారు, లేని నాడు ఏకాదశి. ఇప్పుడు మూర్తి యింట్లో మూడు పూటలైపస్తు. ఆ రాత్రితో రెండు రోజులూ పూర్తవుతాయి. తెచ్చిన రేషనుబియ్యం అయిదురోజులే వస్తయి. హిందూదేశపు జనాభా రేషను లెక్కల్ను బట్టి 50 కోట్లు వున్నా, మూర్తి యింట్లో ముగ్గురే. తల్లి ఎంతో మొరపెట్టింది, అధమం మరో మనిషి వున్నట్టు చీటీపుట్టించమని. వీల్లేదన్నాడాయన. బ్లాకు మార్కెట్టులో కొనలేరు.

గడియారం తన పని చేసుకు పోతూంది. నాలుగయింది. ప్రక్కవాడు చాల తొందర పడుతున్నాడు. బెల్లయింది. మూర్తి గుండెల్లో రాయిపడింది. అందరూ క్లాసు రూముల్లోంచి బయట పడ్డారు. రోడ్డుముఖం పట్టేరు. మూడు పూటల్నుండి తిండి లేదేమో కళ్ళు తిరుగుతున్నాయి. పక్కగా పోతున్న మురళిని పిల్చేడు, వాడి ఆధారంగా పోదామనుకుని. ఏదో అర్జంటు పని వుందంటూ వాడు పోయాడు.

శర్మ పోతూ మూర్తిని కలుసుకుని రెండడుగులు జోరుగా వేసి ముందుగా పోతున్న అమ్మాయిల దగ్గరగా వెళ్ళి వాళ్ళపై వర్ణనలు మొదలెట్టాడు. మూర్తికి ఆ నీరసంలో వెగటుగా తోచినయి. శర్మ వాళ్ళనూ, ఖరీదయిన చీరల్నూ, వాళ్ల ఫేషన్లనూ వర్ణిస్తూంటే మూర్తికి ఎందుకంత ఆడంబరం అనే ధోరణిలో పోసాగేయి ఆలోచనలు. ఇల్లు వచ్చేసింది.

తల్లి యింట్లో ఒకమూల కూచుంది. ఆపాటికి రోజూ వంట ప్రయత్నంలో వుండేది. కాళ్ళు కడుక్కుని మూర్తి వీధిలో చాప వేసుకూర్చున్నాడు. అలాగే చీకటి పడింది. "నాయనా, రేపు బియ్యం యిచ్చేటప్పుడు విరుచుకోమని శేరు బియ్యం అప్పుగా కొట్టు వాడివ్వడా?" తల్లి అంది. మూర్తి మాట్లాడలేదు.

అరగంట గడిచింది. తండ్రి వచ్చేడు. భుజం మీద వేసుకున్న చిన్న మూట విప్పి భార్య ముందు పోసేడు. "ఎలాగ..." భార్య మాట పూర్తి చెయ్యకుండానే "ఒకరూపాయి అప్పు దొరికింది, తెచ్చేను" అన్నాడు. ఆమె లేచింది. పొయ్యి రాజేసింది. మరో అరగంటలో చిన్న దీపపుబుడ్డి దగ్గర రాసుకుంటున్న మూర్తిని పిలిచింది. ముగ్గురూ కూర్చున్నారు. మెత్తగా ఉడకపెట్టిన ఆ తెల్ల దుంపలకు కొంచెంగా చింతకాయ పచ్చడి రాసుకుంటూ తిన్నారు. ఆ రాత్రి గడిచింది. మర్నాడుదయాన్నే కోమటి కొట్టుదగ్గరకు పోయి పద్దు బుక్కులో రాసి ఆవారం బియ్యం మూర్తి తెచ్చేడు. ఎన్నాళ్ళు? ఐదురోజులు. తరువాత కుదురుతే మిగతా రెండురోజులూ తెల్లదుంపలు!

# సుషుప్తి

ఎన్నటికో పరిసమాప్తి
ఈ గాఢ మహాసుషుప్తి
ఎన్నటికానో లయమ్ము
ఈశూన్య నిశాలయమ్ము
ఎంతవరకు మోస్తుంది?
ఈ తమో జటాభారం!
నవకాలపు నగ్నశిరం
భువిదాకిన భగ్నకరం
ఎంతవరకు ప్రాగ్భామిని
గొంతుకలో మూల్గుతుంది
ఈయరుణారుణకిరణం
ఎప్పుడుమియు నిప్పుకణం
ఎన్నాళ్ళని తూర్పువాటి
ఏడుస్తుంది "జొటజొట"
ఎన్నాళ్లెముకల కొరిది
వినిపిస్తుంది "కిటకిట"

చీల్చివేయు నెంతవరకు
చీకిన కర్ణపుటంచుల
చీకటి లోయల మ్రోగే
ఘూక కఠోరపు కూతలు

ఎన్నటికో పరిసమాప్తి
ఈగాఢ మహా సుషుప్తి
ఎన్నటికానో లయమ్ము
ఈ శూన్య నిశాలయమ్ము

—సి. నారాయణరెడ్డి